క్లుప్తంగా

యోగి వేమనకు ఘన నివాళి

గుడివాడటౌన్: యోగి వేమన ప్రవచనాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డి.ఆర్.బి. ప్రసాద్ సూచించారు. స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో యోగి వేమన జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డి.ఆర్.బి.ప్రసాద్ మాట్లాడుతూ.. మూఢ విశ్వాసాలు, అనాగరిక చర్యలపై రాజీలేని పోరాటం చేసిన వేమనను సంస్కర్తగా భావించాలన్నారు. ఆయన భావాలను అమలుచేస్తే సమాజానికి మంచి జరుగుతుందన్నారు. గ్రంథాలయ సిబ్బంది టి.ప్రవల్లిక, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

పామర్రు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుని ఉత్తములుగా ఎదగాలని పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం అధ్యక్ష ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీకృష్ణ, కోటి పాండురంగారావు సూచించారు. స్థానిక ఎస్‌కేఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో యోగి వేమన జయంతి, ఘంటసాల శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు గురువారం పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న చిన్న పదాలతో ఎంతో మంచి అర్థం వచ్చేలా వేమన పద్యాలు రచించారని పేర్కొన్నారు. ఆ పదాల్లోని అర్థాలను తెలుసుకుని పాటించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఎస్.పద్మజ, ఉపాధ్యాయినిలు ఆర్.రంగవల్లి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



కై కలూరు: ఢిల్లీకి చెందిన నేషనల్ క్వాలిటీ అస్యూరెన్సు స్టాండర్ట్స్ (ఎన్‌క్యూఏఎస్) బృంద సభ్యులు డాక్టరు బసంత్ కుమార్ గుప్తా, డాక్టరు వెంకటేష్ కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) గురువారం పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల లభ్యత, ఆస్పత్రిలో పరికరాల పనితీరు, వైద్యుల సేవలపై ఆరా తీశారు. సీహెచ్‌సీలో అవసరమైన మరిన్ని వసతుల కల్పనపై పలు సూచనలు చేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాంబాబు, డాక్టర్లు దుర్గాప్రసాద్, నీలిమా, కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీతో అనుసంధానానికి గడువు పెంచాలని వినతి

పామర్రు: ఈకేవైసీతో సీఎఫ్ఎంఎస్, ఆధార్, ఫోన్ నంబర్ల అనుసంధానానికి గడువు పెంచాలని పామర్రు ఎస్టీఓ పి.శోభన్‌బాబుకు గురువారం ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పామర్రు మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు సంగం సుబ్బారెడ్డి, ఎస్.నాగిరెడ్డి విజ్ఞప్తిచేశారు. ఈ నెల 20వ తేదీ లోపు రిటైర్డ్ ఉద్యోగులు తమ సీఎఫ్ఎంఎస్, ఆధార్, ఫోన్ నంబర్లను ఈకేవైసీలో అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కొంత మంది అనారోగ్యంతో బాధపడుతున్నారని, మరి కొందరు ఇతర గ్రామాల్లో ఉన్నారని పేర్కొన్నారు. వారికి ఈకేవైసీపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సమస్యను గుర్తించి అనుసంధానం గడువును పెంచాలని కోరారు.

కోదండ రామాలయం వద్ద అన్నసమారాధన

గుడివాడటౌన్: శ్రీకోదండ రాముడి కరుణ గుడివాడ ప్రజలపై ఉండాలని వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ ఆకాంక్షించారు. స్థానిక పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న శ్రీ కోదండ రామాలయంలో ధనుర్మాస మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం అన్నసమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 70 ఏళ్ల పైబడి తమ పూర్వీకులు ఇక్కడ ధనుర్మాస మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ(చంటి), వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, డొక్కు రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొబైల్ ఆధార్ శిబిరాలు ప్రారంభం

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలంలోని పలు గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంప్‌లు గురువారం నుంచి ప్రారంభమయ్యాయని ఎంపీడీఓ బి.వై.విష్ణుప్రసాద్ తెలిపారు. తొలి రోజు ఇలపర్రు గ్రామంలో ఈ కార్యక్రమం జరిగిందని పేర్కొన్నారు. రోజూ ఉదయం పది నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మొబైల్ ఆధార్ క్యాంప్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన తుమ్మలపల్లి, 21న రుద్రపాక, 23న అరిపిరాల, 24వ తేదీన తమిరిశ గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని వివరించారు. పేరులో అక్షరదోషాలు, పుట్టిన తేదీలు, చిరునామా మార్పులు చేయించుకోవచ్చని సూచించారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

మండవల్లి: కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండవల్లి మండలం పులపర్రు గ్రామంలో సర్పంచ్ వేంద్ర నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు దారా రమేష్ ఆధ్వర్యంలో డీఎన్నార్ గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కుల, మత, ప్రాంత, పార్టీ అని భేదాలు లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మూడేళ్లలో అందజేసిన పథకాల లబ్ధికి సంబంధించిన బ్రోచర్‌లను అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ తెలిపారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, గుడివాడ తమ్మిస్వామి, ముంగర మల్లికార్జునరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పీఏసీఎస్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ణ, నాయకులు మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ బలే నాగరాజు, గుడివాడ మురళీకృష్ణ, ఎస్ఐ టి.రామకృష్ణ, హౌసింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ లలిత, ఈఓపీఆర్డీ ఎస్.వి.రాధిక, కార్యదర్శి ఎం.కొండలు తదితరులు పాల్గొన్నారు.



పులపర్రులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

రహదారుల అభివృద్ధికి కృషి

కైకలూరు: నియోజకవర్గంలోని అన్ని రహదారుల అభివృద్ధిక కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. కలిదిండి మండలం వెంకటాపురం వద్ద కై కలూరు – కలిదిండి ఆర్అండ్‌బీ రహదారి ప్రత్యేక మరమ్మతుల కోసం మంజూరైన రూ.1.92 కోట్ల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. రహదారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మీ, పాము రవికుమార్, తిరుమాని రమేష్, గద్దె ఆనందకుమార్, మసిముక్కు మారుతి ప్రసన్న, బత్తిన ఉమామహేశ్వరరావు, గోదావరి సత్యనారయణ, వడ్లాని పార్థసారథి, ఆర్అండ్‌బీ డీఈఈ విజయశేఖర్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌గా మురళీకృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మురళీకృష్ణ

గుడివాడటౌన్: గుడివాడ మునిసిపల్ కమిషనర్‌గా వి.మురళీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గాలేరు–నగరి సుజల స్రవంతి ప్రాజెక్ట్ యూనిట్–1 స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా తిరుపతిలో సేవలు అందిస్తున్న ఆయన గుడివాడ మునిసిపాలిటీకి బదిలీపై వచ్చారు. గురువారం సాయంత్రం మునిసిపల్ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. గతంలో గుడివాడ తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్‌గా, తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన పట్టణానికి సుపరిచితులు. అన్ని శాఖల అధికారులను కలుపుకొని పట్టణాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు.

భోజనశాలకు విరాళం

మండవల్లి: స్థానిక దత్తపరంపర సహిత షిర్డీసాయి బాబా మందిరంలో నిర్మించనున్న భోజనశాలకు చేవూరుపాలెంనకు చెందిన గణేశుల సురేంద్ర, కుటుంబ సభ్యులు రూ.10116 విరాళం సమర్పించారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత డీఎన్నార్ లెవన్స్



విజేత డీఎన్నార్ లెవెన్స్ జట్టుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కుమారులు వినయ్, శ్యామ్

కైకలూరు: సంక్రాంతి క్రీడల్లో భాగంగా ఎమ్మెల్యే డీఎన్నార్ సిరీస్ పేరుతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సీనియర్ క్రికెటర్లు నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలో అతిథ్య డీఎన్నార్ లెవన్స్ జట్టు గురువారం విజేతగా నిలిచింది. ఈ నెల 12వ తేదీన ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించిన టోర్నీలో నియోజకవర్గ స్థాయిలో 66 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు దూలం వినయ్, శ్యామ్ బహుమతులను అందించారు. మొదటి బహుమతి దాత జనపాల పవన్ సమకూర్చిన రూ.25 వేలను డీఎన్నార్ లెవన్స్ జట్టుకు, రెండో బహుమతి బూరుబోయిన శ్రీనివాసరావు అందించిన రూ.15 వేలను మండవల్లి జట్టుకు, మూడో బహుమతి దాత పాణెం జయకిషోర్ అందించిన రూ.10 వేలను కైకలూరు ప్రతాప్ ఎయిటర్స్ అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సీనియర్ క్రికెటర్ నిమ్మల సాయి నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తలారి జాన్, కూరవరపు సతీష్, ప్రసాద్, మదన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఫైనల్ మ్యాచ్

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ 8 ఓవర్లకు 8 మంది క్రీడాకారులతో జరిగింది. ఫైనల్ మ్యాచ్ మండవల్లి – కైకలూరు డీఎన్నార్ లెవన్స్ మధ్య ఉత్కంఠగా సాగింది. పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారు. ముందుగా బ్యాటింగ్ చేసిన మండవల్లి జట్టు ఏడు వికెట్ల నష్టానికి 87 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేసిన డీఎన్నార్ లెవెన్స్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. అంపైర్లుగా శశి, చింటు వ్యవహరించారు.

ఎంపీపీ చందనకు మాతృవియోగం



భారతి భౌతికకాయనికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు తల్లి భారతి (75) గురువారం ఉదయం మృతి చెందారు. కై కలూరు మండలం కోరుకొల్లు స్వగృహంలో ఆమె మరణించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరుకొల్లులో వెళ్లి భారతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎంపీపీ చందనకు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీని పరామర్శించి వారిలో కలిదిండి జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చెన్నంశెట్టి కోదండ రామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుమ్మడి వెంకటేశ్వరరావ, నీలపాల వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, గద్దె ఆనందకుమార్, కట్టా నాగలక్ష్మి, దూలం ఆది వినయ్ కుమార్, నరహరిశెట్టి నరసయ్య, మహదేవ విజయబాబు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరు సమీపంలోని ఏనుగుల కోడు డ్రెయిన్ పూడికతీత పనులను గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. వర్షాకాలంలో పంట పొలాలకు ముంపు సమస్య లేకుండా ఉండేందుకు ముందస్తుగానే ఏనుగులకోడులో పూడిక తీత పనులు చేపట్టామని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తెలిపారు. రొయ్యూరు నుంచి పమిడిముక్కల మండలం ఫత్తేలంక వరకు 14.5 కిలోమీటర్ల పొడవునా రూ.55 లక్షలతో డ్రెయిన్ పూడికతీత పనులు చేపడ్తామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు పెనమకూరు నరసింహశర్మ, నందేటి గంగాభవాని, నిమ్మగడ్డ ప్రభుదాస్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జొన్నల బ్రహ్మానందరెడ్డి, నాయకులు నడకుదురు రాజేంద్ర, మోర్ల రామచంద్రరావు, సోలే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఏనుగులకోడు డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

అర్హులందరికీ గూడు కల్పించడమే లక్ష్యం

గుడివాడ ఎంపీడీఓ వెంకటరమణ

గుడివాడరూరల్: అర్హులు అందరికీ గూడు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని గుడివాడ ఎంపీడీఓ అనగాని వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని శేరీవేల్పూరు గ్రామంలోని లబ్ధిదారులకు గురువారం ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పేదలు అందరూ సొంతింటిలో నివసించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన స్థలాల్లో వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులతో హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు చర్చించి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. కాలనీల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర వసతుల కల్పనకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారని వివరించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సొంతింట్లో నివాసం ఉండేలా సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆశయ సాధన కోసం అధికారులు, ఉద్యోగులు సహకరించాలని సూచించారు. అనంతరం కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ డి.హరికిరణ్ పృథ్వీ, పంచాయతీ కార్యదర్శి పాగోలు పూర్ణచంద్రరావు, హౌసింగ్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

23న మెగా వైద్య శిబిరం

గుడివాడటౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో ఈ నెల 23వ తేదీ విజయవాడకు చెందిన రెండు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు గురువారం ప్రకటించారు. కళ్లు, ఎముకలు, కీళ్లు, కండరాలకు సంబంధించి ఆయా విభాగాల వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వావిరాల రజనీకాంత్ శర్మ, డాక్టర్ ఓషేర్ అహ్మద్, డాక్టర్ రవితేజ తదితరులు సేవలందిస్తారని తెలిపారు.

గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

పామర్రు ఎంపీపీ అశోక్‌కుమార్

పామర్రు: గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలానికి మంజూరైన 12 ఇన్సినెరేటర్ (దహనం చేసే) యంత్రాలను ఆయా పంచాయతీల కార్యదర్శులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే సిబ్బంది తమ వద్ద ఉన్న వాడేసిన మెడికల్ కిట్లు, నాప్‌కిన్ తదితరాలను ఈ ఇన్సినెరేటర్‌లో వేస్తే అవి కాలిపోతాయని వివరించారు. యంత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు హాని కలగదని పేర్కొన్నారు. మండలంలోని పామర్రు, ఐనంపూడి, జుఝవరం, కనుమూరు, కొమరవోలు, కొండిపర్రు, కురుమద్దాలి, పసుమర్రు, పెదమద్దాలి, రాపర్ల, యలకుర్రు, జమీగొల్వేపల్లి గ్రామాలకు వీటిని అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు టి.శ్రీనివాసరావు, మహేష్, ఎంపీడీఓ వై.రామకృష్ణ, ఈఓపీఆర్డీ వి.ఎ.విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సలీం, సుబ్రహ్మణ్యేశ్వరరావు, సోమేశ్వరరావు, సూపరింటెండెంట్ ప్రమీళ పాల్గొన్నారు.



ఇన్సినెరేటర్ యంత్రాలను అందజేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

గుడివాడటౌన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని అసిస్టెంట్ కమిషనర్ రంగారావు సూచించారు. సుమారు 900 మంది పైబడి లబ్ధిదారులకు మల్లాయిపాలెం లే–అవుట్‌లో కేటాయించిన స్థలాలను శుక్రవారం చూపించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తవుతున్న సందర్భంగా ఇళ్ల స్థలాల్లోకి మెటీరియల్‌ను తరలించేందుకు ఇబ్బందులు ఉండవన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోనే ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని తక్షణమే లబ్ధిదారులకు అందజేస్తామని, ఇళ్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో పెద్ద సంఖ్యలో శంకుస్థాపనలు ఉంటాయని ఈ మేరకు లబ్ధిదారులు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

100 రోజులు పని కల్పించాలి

గుడివాడటౌన్(నందివాడ): జాబ్ కార్డు కలిగిన వారికి 100 రోజులు ఉపాధి హామీ పనులను కచ్చితంగా కల్పించాలని ఎంపీడీఓ బి.వై.విష్ణుప్రసాద్ పేర్కొన్నారు. నందివాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రోగ్రామ్ మేనేజర్, ఫీల్డు అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మేట్లు ఇప్పటికే కొన్ని పనులు గుర్తించినందున వాటిని తక్షణమే ప్రారంభించాలని సూచించారు. త్వరితగతిన చేపట్టాల్సిన పనులను గుర్తించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎప్పటికప్పుడు కొత్త పనులు గుర్తించేలా అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్కరికీ పని తక్కువ కాకుండా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదేనని ఎంపీడీఓ స్పష్టంచేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పామర్రు: రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వి.వి.భరత్‌రెడ్డి సూచించారు. మండలంలోని పామర్రు, కురుమద్దాలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు ధాన్యం నమూనాలు ఇచ్చి తేమ శాతాన్ని నిర్ధారించుకుంటే చాలని, మిగిలిన పనులన్నీ కొనుగోలు కేంద్రం సిబ్బంది చూసుకుంటారని పేర్కొన్నారు. రైతులు మిల్లర్ల వద్ద వెళ్లే అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. సేకరించిన ధాన్యానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంచులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపే వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమవుతోందని పేర్కొన్నారు. మండలంలోని ఐదు కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 15,200 టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపుతామన్నారు. రెవెన్యూ సిబ్బంది రాము, కొనుగోలు కేంద్రాల సిబ్బంది అజయ్, రమ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

22న కానిస్టేబుల్ పరీక్షలు

గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ, వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కాలేజీ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 22వ తేదీన కానిస్టేబుళ్ల భర్తీకి పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.వి.రామాంజనేయులు తెలిపారు. గురువారం రాత్రి ఆయన స్థానిక కాలేజీల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఇంజినీరింగ్‌లో 1,671 మంది, పాలిటెక్నిక్‌లో 960 మంది, ఫార్మశీలో 312 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్స్ జి.ప్రసాద్, ఎ.లక్ష్మణరావు, ఎస్ఐ వి.ఏసేబు, రైటర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ రామాంజనేయులు

అద్దాల మండపం నిర్మాణానికి విరాళం

ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురం సెంటర్లో సాయిబాబా మందిరంలో అద్దాల మండపం నిర్మాణానికి శ్రీహరిపురానికి చెందిన బొగ్గవరపు సుబ్రహ్మణ్యం, సీతామహాలక్ష్మి దంపతుల కుమార్తె బేబినాగవెంకట సాయికీర్తి రూ.10,116 విరాళం అందించారు. ఈ మొత్తాన్ని చైర్మన్ పరసా ఏడుకొండలకు అందజేశారు. కార్యక్రమంలో బొగ్గవరపు ప్రసాద్, మరిపు ఈశ్వరరావు, నీలం సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలను సహించం

ముదినేపల్లి రూరల్: పేదలకు ఉపాధి కల్పించేందుకు ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ హామీ ఉపాధి పథకంలో అక్రమాలను సహించేది లేదని ఆ పథకం జిల్లా పీడీ రాంబాబు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద 2020–21, 2021 –22లో నిర్వహించిన పనులపై గురువారం ఏర్పాటుచేసిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో నివేదిక సమర్పించారు. ముదినేపల్లి మండలం ఊటుకూరు, చేవూరు పంచాయతీ కార్యాలయాల పరిధిలో నిర్వహించిన పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. సక్రమంగా పనులు చేయనివారికి వేతనాలు ఇచ్చారంటూ కొందరు గ్రామస్తులు పీడీకి నివేదించారు. దీనిపై సంబంధిత సిబ్బందితో పీడీ మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతి అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వానికి చెడ్డపేరు రావడంతో పాటు పేదలకు అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఏపీఓ అప్పారావు, ఎంపీడీఓ పి.మల్లీశ్వరి, విజిలెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మండవల్లి: మండలంలోని పులపర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) తెలిపారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించి, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా కైకలూరు డిగ్రీ కాలేజీ

కైకలూరు: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను కై కలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. కృష్ణా యూనివర్సిటీ పరిధిలో విజయవాడ ఎస్‌డీఎంఎస్ఎం డిగ్రీ కాలేజీ, మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ, మైలవరం ఎల్‌హెచ్ఆర్ డిగ్రీ కాలేజీ, కై కలూరు వైఎస్సార్ డిగ్రీ కాలేజీ మహిళ జట్లు పోటీపడ్డాయి. లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీల్లో వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ జట్టు మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ జట్టుపై 35–20, 35–17 పాయింట్ల తేడాతో గెలిచి యూనివర్సిటీ మహిళా బాల్ బ్యాడ్మింటన్ విజేతగా నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కుమారులు దూలం వినయ్, శ్యామ్‌లు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు రఘునాథరెడ్డి, దాత వెంకటరమణ, కాలేజీ అభివృద్ధి కమిటీ సెక్రటరీ గురజాడ ఉదయశంకర్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏలకు నియామక పత్రాల పంపిణీ



పామర్రు: మండలంలో ఖాళీగా ఉన్న ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్ (ఎఫ్ఏ) పోస్టులను భర్తీ చేశామని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపికైన ఎఫ్ఏలకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని నిమ్మలూరు, ఎలకుర్రు, కొరిమెర్ల, ప్రాకర్ల పంచాయతీల పరిధిలో కొత్త ఫీల్డు అసిస్టెంట్లకు ఇంటర్వ్యూలను నిర్వహించామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియామకపు ఉత్తర్వులను అందజేశామని అన్నారు. వైస్ఎంపీపీ ఎ.శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, మహేష్, రాజ్యలక్ష్మి, పావని, ఎంపీడీఓ వై. రామకృష్ణ, ఏపీఓ పోలురాజు, ఈఓపీఆర్డీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో మొవ్వ విద్యార్థులకు తృతీయస్థానం

మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల విజయవాడలో జరిగిన క్విజ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారని ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎస్.మాధవి తెలిపారు. తమ విద్యార్థులు పి.వాణి, పి.మాధవి క్విజ్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఏపీ తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.వి.విజయబాబు చేతుల మీదగా బహుమతి అందుకున్నారని పేర్కొన్నారు.

మినుములో సస్యరక్షణ చేపట్టాలి

పామర్రు(పమిడిముక్కల): మినుము సాగుచేస్తున్న పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పమిడిముక్కల మండల వ్యవసాయ అధికారి ఎస్.గణేష్ రెడ్డి సూచించారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మినుములో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రెండు రకాల పురుగు మందులను కలిపి పిచికారీ చేయవద్దని సూచించారు. ఇలా చేస్తే పైరు దెబ్బతింటుందని వివరించారు. వ్యవసాయ సహాయకులు కావ్య, రైతులు పాల్గొన్నారు.